# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన సంస్థలు త్వరితగతిన ప్రారంభమయ్యేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

- విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగబోదని కేంద్ర మంత్రి కుమారస్వామి ఉద్ఘాటించారు.

- ఆధునిక విద్యాలయాలు విద్యార్థులకు సమగ్ర వికాసాన్ని అందిస్తున్నాయని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

- కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను నిర్మూలించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు డాక్టర్ కె. పద్మావతి కోరారు.

========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఈరోజు స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డ్ (SIPB) 3వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దీంతో SIPB ఇప్పటివరకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల విలువ 3 లక్షల కోట్ల రూపాయలు దాటింది. పెట్టుబడులు త్వరితగతిన కార్యరూపం దాల్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఒప్పందాలపై పరిశ్రమల యాజమాన్యాలతో నిరంతరం చర్చలు జరుపుతూ.. సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులు మొదలయ్యేలా చూడాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్నదృష్ట్యా మంచి ఫలితాల కోసం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేయాలని చెప్పారు. 10 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టే ప్రతి ప్రాజెక్టు పురోగతిని తప్పనిసరిగా పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

========================

విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్ డీ కుమారస్వామి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విశాఖ ఎంపీ శ్రీభరత్, అనకాపల్లి ఎంపీ సీఎమ్ రమేష్ తో కలిసి ఈరోజు ఆయన స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ను పునరుద్ధరించే

చర్యల్లో భాగంగానే 11 వేల 400 కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించామన్నారు. నిరర్థక ఆస్తులు.. స్టీల్ ప్లాంట్ మనుగడకు భారం కాకుండా చూసుకోవడం తమ ఉద్దేశ్యమన్నారు. రెండు బ్లాస్ట్ ఫర్నేస్ లు మళ్లీ పని చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్రమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు విభిన్న రీతిలో విద్యనందిస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, పరిశ్రమల శాఖమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులో జరిగిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ… ఆధునిక విద్యాలయాలు విద్యార్థులకు సమగ్ర వికాసాన్ని అందిస్తున్నాయని చెప్పారు. ఆచరణాత్మకమైన సాంకేతిక విద్యా విధానాన్ని అమలు చేయడంలో ప్రైవేట్ స్కూల్స్ ముందుండాలన్నారు.

=======================

మున్సిపల్ ఉద్యోగులు, స్వచ్ఛాంధ్ర కమిషన్ సిబ్బందికి *బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS)* పై అవగాహనా కార్యక్రమాన్ని విజయవాడలో ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ మాట్లాడుతూ… వేస్ట్ డిస్పోజల్ ట్రీట్మెంట్ ఇంకా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగంగా ఉపయోగించే వాహనాలు, పరికరాలు, పాటించవలసిన నియమాలపై అవగాహన కల్పించామని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని ఆయన సూచిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=======================

కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల వివక్షను నిర్మూలించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకులు డాక్టర్ కె. పద్మావతి కోరారు. కుష్టు వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా విజయవాడ గొల్లపూడి లోని విమ్స్ ఫిజియో థెరపీ కళాశాలలో ఈరోజు ఏర్పాటు చేసిన 'స్పర్శ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్' కార్యక్రమంలో… వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రూపొందించిన కరపత్రాల్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాజరైన ఫిజియోథెరపీ విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ… కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 23వ తేదీ వరకూ నిర్వహిస్తామని చెప్పారు. మైకో బాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపించే ఈ వ్యాధి.. ఎం.డి.టి మందులతో పూర్తిగా నయమవుతుందని, ఈ మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పూర్తి ఉచితంగా లభిస్తాయని చెప్పారు.

విరామం

=======================

రైతులు సేంద్రియ ఎరువుల వినియోగం వైపు మొగ్గుచూపేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటన, ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కలెక్టర్ ఈరోజు ఎ. కొండూరు, జి. కొండూరు మండలాల్లో పర్యటించి, నిమ్మతోట, ఆపిల్ బేర్ తోటలను పరిశీలించారు. తోటల్లో సూక్ష్మ పోషకాల లోపాన్ని గుర్తించి.. సకాలంలో పోషకాలు ఇచ్చేలా రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణపై దృష్టి పెట్టాలని, ఉత్పాదకతను పెంచేందుకు ఎంపీడీవోలు కృషి చేయాలని అన్నారు. సహజ సేంద్రియ ఎరువు తయారీ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలని

స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం సహాయంతో సన్న, చిన్నకారు రైతులను పండ్ల తోటల పెంపకం దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

=======================

ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకులో చలి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. అరకు ప్రాంతంలో ప్రకృతి అందాలతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు. మూడు రోజులపాటు చలి ఉత్సవాలను నిర్వహించనున్నామని వివరించారు. ఈ సంవత్సరం హెలికాప్టర్ ద్వారా ప్రకృతి అందాలను వీక్షించేందుకు వీలుగా హెలీప్యాడ్ ను ఏర్పాటు చేసినట్టు పేర్కొంటూ... అరకు చలి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

=======================

పాడిరైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, పశువులకు జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర నాయుడు సూచించారు. విజయవాడ గొల్లపూడిలో ఉచిత పశు వైద్యశిభిరాలను ఆయన ప్రారంభించారు. ఈ శిబిరాల్లో పశు వైద్యాధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా దామోదర్ నాయుడు మాట్లాడుతూ... ఈ శిబిరంలో పశువులలో నట్టల నివారణ, గొర్రెలు, మేకలల్లో డి వోమింగ్, పశువులలో గర్భకోశ వ్యాధులు, తదితర వ్యాధులకు చికిత్స చేసినట్టు తెలిపారు.

(వాయిస్ 32 సెకన్లు)

=======================

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈరోజు ఆయన పాడేరులోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని  చక్కదిద్దే దిశగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని, దావోస్ పర్యటనతో రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే ఉన్నారని చెప్పారు.

=======================

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్... పోలీస్  శాఖ ఆధ్వర్యంలో  యువతకు ఫిబ్రవరి 1 తేదీన జాబ్ మెళా నిర్వహించనున్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో అర్హులైన యువతీ యువకులకు టాటా ఎలక్ట్రానిక్ సంస్థ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు రంపచోడవరం ఏఎస్పీ సాయి ప్రశాంత్ తెలిపారు. 10వ తరగతి నుండి డిగ్రీ పూర్తి చేసిన 18 నుండి 26 సంవత్సరాల మధ్య వయసుగల వారు స్థానిక పోలీస్ స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకోసుకుని.. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎ ఎస్పీ సూచించారు.

=======================

పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీగా ఎల్. నాగేశ్వరి ఈరోజు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ ఓ. దిలీప్ కిరణ్ ఏసీబీకి బదిలీపై వెళుతుండడంతో ఎల్.నాగేశ్వరిని నియమించారు. ఈ జిల్లా ఏర్పడిన నుంచి ఇప్పటి వరకు అదనపు ఎస్పీగా దిలీప్ కిరణ్ బాధ్యతలు నిర్వహించి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

=======================
=======================